**మనిషి తరించాలంటే మూడు రుణాలు తీర్చుకోవాలంటుంది శాస్త్రం. అవే దేవ, పితృ, రుషి రుణాలు. దేవతలను ఆరాధించడం అంటే యజ్ఞయాగాదులు, జపతపాదులు చేయడం ద్వారా దేవరుణం తీరుతుంది. అలాగే వేద శాస్త్రాల అధ్యయనంతో రుషి రుణం తీరుతుంది. మన పూర్వీకులైన తండ్రి, తాత, ముత్తాతలకు శ్రాద్ధకర్మలు నిర్వహించడం ద్వారా పితృ రుణం తీరుతుంది.**

# పితృదేవతల పక్షం

మరణించిన వ్యక్తి తిథి నాడు తద్దినం పెట్టడం హిందూ సంప్రదాయంలో అనాదిగా వస్తున్న ఆచారం. తండ్రి మరణించిన తిథినాడు కొడుకు తన తండ్రి, తాత, ముత్తాతలను తలుచుకొని పితృయజ్ఞాన్ని నిర్వహిస్తాడు. మరి పుత్రులు లేని వారి సంగతేమిటి? వారి కోసం శాస్త్రం ఓ మార్గాన్ని నిర్దేశించింది. కుటుంబాలలో ఏ కారణం చేతనో పెళ్లికాని సోదరి, సోదరులు మరణించి ఉండవచ్చు. పెళ్లయినా.. సంతానం లేక మరణించిన దంపతులూ ఉండవచ్చు. ప్రమాదాల్లో మరణించిన చిన్నపిల్లలు, యుద్ధాలలో




ప్రాణాలు వదిలిన వాళ్లు, ఆత్మహత్య చేసుకున్న వాళ్లు, ప్రకృతి వైపరీత్యాల్లో కన్నుమూసిన వాళ్లు ఉండవచ్చు. అటువంటి వారికి తిలోదకాలు ఇచ్చి.. వారిని ఊర్ధ్వలోకాలకు పంపడం కోసం నిర్దేశించినవే మహాలయపక్షాలు.

భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య వరకు ఉన్న పదిహేను రోజులను మహాలయ పక్షాలు అంటారు. మరణించిన తండ్రి, తాత, ముత్తాతలను తలుచుకొని వారి వారసులు శ్రాద్ధ విధులు నిర్వర్తించడానికి వీటిని నిర్దేశించారు. వీటినే పితృపక్షాలు అనీ, అపరపక్షాలు అనీ పిలుస్తారు. మరణించిన పితృదేవతలకు భక్తిగా ఆహారాన్ని అందించి, వారి ఆకలి తీర్చడమే మహాలయ పక్షాల ప్రధాన ఉద్దేశం.

మరణించిన వ్యక్తులను పూజించాల్సిన అవసరం ఉన్నదా? వారిని పూజించడం వల్ల మనకు కలిగే ప్రయోజనం ఏమిటి? మృతుని ఆత్మకు మనకు సంబంధం ఉన్నదా? జీవాత్మ ఏకకాలంలో మూడు శరీరాలను ఒకదానిపై ఒకటిగా ధరిస్తుంది. లోక వ్యవహారంలో మనకు కనిపించే శరీరాకృతులన్నీ స్థూల శరీరాలు. దీనిలోపల సూక్ష్మ శరీరం, దానిలోపల కారణ శరీరం ఉంటాయి. మరణించిన వ్యక్తి జీవాత్మ సూక్ష్మ కారణ శరీర సహితంగా ఏడాదిపాటు ఊర్ధ్వముఖంగా పయనించి వసులోకాన్ని చేరుకుంటుంది. ఏడాది పాటు విశ్రాంతి లేకుండా పయనించే ఆత్మను ప్రేతాత్మ అంటారు. ప్రయాణంలోని శ్రమ కారణంగా ప్రేతాత్మకు ఆకలిదప్పులు అధికంగా ఉంటాయి. మాసికాలలో పెట్టే ఆహారంతో వారి ఆకలిదప్పులు తీరుతాయి. తృప్తి చెందిన ప్రేతాత్మ తన సంతానం తరతరాలు బాగుండాలని ఆశీర్వదిస్తుంది. సంవత్సరీకం కార్యక్రమంలో సపిండీకరణం జరుగుతుంది. తద్వారా ప్రేతాత్మ వసురూపాన్ని ధరించి వసులోకంలోకి ప్రవేశించగలుగుతుంది. పితృకార్యాన్ని చేసే కర్త శాస్త్రోక్త నిష్ఠను ఏడాదిపాటు పాటించే అవకాశాలు ఈనాటి సమాజంలో లేవు కాబట్టి సపిండీకరణను పదకొండో రోజునే పూర్తి చేస్తున్నారు. మానవలోక ప్రమాణంలో ఒక సంవత్సర కాలం పితృలోక ప్రమాణంలో ఒక దినం అవుతుంది. మనం ఏడాదికి ఒక రోజున పెట్టే తద్దిన భోజనం పితృదేవతలకు అనుదినం పెట్టినట్లు అవుతుంది. ఈ విధంగా మరణించిన మన పూర్వీకులు అందరినీ పూజించుకునే భాగ్యాన్ని కలిగించే పితృపక్షాలు నిజంగా పుణ్యదినాలే కదా!

... శ్రీ

### ▪ సర్వ కారుణ్యం...

**కాలం** చేసిన వంశస్థులతో పాటు, పుత్రులు లేని గురువులకు, స్నేహితులకు కూడా మహాలయ పక్షాల్లో తిలోదకాలతో పిండప్రదానం చేసే అర్హత, అధికారం కర్తకు ఉంటుంది. దీనినే సర్వకారుణ్య తర్పణ విధి అంటారు. ఏ కారణంతోనైనా తద్దినం పెట్టకపోతే.. ఆ దోషం మహాలయ పక్షాల్లో పితృవిధి నిర్వర్తిస్తే తొలగిపోతుందంటారు. ఈ పక్షాల్లో పితృదేవతలు ఆశతో తమ వారసుని ఇంటిని ఆవహించి ఉంటారని నమ్ముతారు. పితృవిధి నిర్వర్తించిన వారసుడిని మనసారా ఆశీర్వదించి, పిల్లాపాపలతో సంతోషంగా జీవించమని దీవిస్తారట.

# కర్పూర హారతి

కథాసుధ

**విదేశాల్లో** విద్యాభ్యాసం పూర్తి చేసిన ఒక యువకుడు వ్యాపారం చేయాలనుకున్నాడు. అదే విషయం తండ్రికి చెప్పాడు. వ్యాపారం ప్రారంభించే ముందు కొన్ని రోజులపాటు కొడుకును గుడికి వెళ్లమన్నాడు తండ్రి. రోజూ దేవుడికి కొబ్బరికాయ కొట్టి, కర్పూర హారతి కూడా ఇవ్వమన్నాడు. 'వ్యాపారం వివరాలు అడగకుండా, గుడికి వెళ్లమంటాడేంటి?' అనుకున్నాడు కొడుకు. అయినా తండ్రి మాటను కాదనలేక రోజూ గుడికి వెళ్లసాగాడు. దేవుడికి కొబ్బరికాయ కొడుతున్నాడు, కర్పూర హారతి ఇస్తున్నాడు. యువకుడు రోజూ గుడికి రావడం గమనించిన పూజారి 'మొక్కు ఏమైనా ఉందా బాబూ?' అని అడిగాడు. 'అలాంటిదేమీ లేదండి. మా నాన్నగారు గుడికి వెళ్లి, రోజూ కొబ్బరికాయ కొట్టమనీ, హారతి ఇవ్వమనీ చెప్పారు' అని బదులిచ్చాడు యువకుడు. ఆ తండ్రి మాటల్లోని ఆంతర్యం గ్రహించిన పూజారి యువకుడితో 'మీ నాన్న మాటల్లో చాలా విషయం దాగుంది. కొబ్బరికాయలోకి నీళ్లు ఎలా వచ్చి చేరుతాయో ఎవరికీ తెలియదు. సంపద కూడేటప్పుడు ఎలా వచ్చి చేరుతుందో తెలియదు. ఇక హారతి విషయానికి వద్దాం.. సంపద తరిగిపోవడం మొదలైతే కర్పూరంలా కరిగిపోతుందని నీకు హెచ్చరిక చేయడానికి ఈ రెండు పనులూ చేయమన్నాడు' అని వివరించాడు పూజారి. 'వ్యాపారం చేయడం గొప్పకాదు. దాన్ని ధర్మబద్ధంగా నిర్వహించాలి. అలాగే సంపద శాశ్వతం కాదు. డబ్బు ఎప్పుడైనా రావొచ్చు, పోవచ్చు. కలకాలం నిలిచేది ధర్మం, న్యాయం మాత్రమే' అని చెప్పాడు. 'హారతి రహస్యం' తెలుసుకున్న యువకుడు తండ్రి దగ్గరికి వెళ్లి కృతజ్ఞతలు చెప్పాడు.



... ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

# క్రమశిక్షణే ఆయుధం





**వర్తమానం** భవిష్యత్‌కు పునాది. యుక్తవయసులో చేసే సావాసాలు భవిష్యత్తును నిర్దేశిస్తాయి. అలవాట్లు పొరపాట్లుగా మారి జీవితాన్ని తీర్చిదిద్దుకోకుండా దెబ్బతీస్తాయి. బలం ఉంది కదా అని యవ్వనంలో కన్నూమిన్నూ కానకుండా వ్యవహరించి జీవితం చేజారిపోయాక పశ్చాత్తాపం చెంది ప్రయోజనం లేదు. ఇదే విషయాన్ని గీతాచార్యుడు హెచ్చరిక చేశాడు. ఆశయ సాధనకు క్రమశిక్షణను మించిన ఆయుధం లేదని పేర్కొన్నాడు.

యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా (6-17)

సరైన ఆహార నియమాలు పాటించాలి. సరైన అలవాట్లు కలిగి ఉండాలి. ఆహార, వ్యవహారాల్లో మంచి, చెడులను గుర్తించిన వాడు దుఃఖం నుంచి దూరంగా ఉండగలుగుతాడు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ఒక్కటే సరిపోదు, దానిని సాధించడానికి అహర్నిశలూ కృషి చేయాలి. ఆత్మసంయమ యోగంలో కృష్ణుడు చెప్పిన ఈ మాట సదా అనుసరణీయం.

... విష్ణువర్ధన్




**ఒకటిన్నర శతాబ్దం కిందట భారతావనిలో ప్రభవించిన మహాపురుషుడు గాంధీజీ. తల్లి పెంపకం, చిన్నతనంలో తాను చూసిన సత్య హరిశ్చంద్ర నాటకం గాంధీజీ మనసుపై బలమైన ముద్ర వేశాయి. ఇవి కేవలం సంఘటనలు కావు! తర్వాత కాలంలో బాపూజీ వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన జీవితానుభవాలు ఎన్నెన్నో!**

# గాంధేయ వేదం

**భౌతిక,** అధిభౌతిక స్థాయిలు ప్రతీ వ్యక్తి జీవితంలో ఏర్పడుతూనే ఉంటాయి. కానీ, అధ్యాత్మ స్థితి అంత తేలికగా లభించేది కాదు. దానిని అందుకోవడానికి జిజ్ఞాస, తీవ్ర కాంక్ష, నిరంతర సాధన తప్పనిసరి. అంతేకాదు, జీవుడి సంస్కారం, పరిసరాలు, సమాజపు పోకడ, సంఘ అవసరాలు, పాపభీతి, సంఘనీతి, దైవప్రీతి, అవమానాలు, అనుభవాలు, ఆదర్శాలు వంటి ఎన్నో విషయాలు అధ్యాత్మ వైపు మనసును మళ్లిస్తాయి.

సత్యమంటే అబద్ధం ఆడకుండా ఉండటం మాత్రమే కాదని, మనసు పట్టుకోలేని ఆ స్థితి ఏమిటో తెలుసుకోవాలన్న ఆకాంక్ష గాంధీజీని ఆలోచింపజేసేది. ఇది ఆ మహనీయుడి సత్యాన్వేషణలో తొలిమెట్టు. ఇంతలో భారత స్వాతంత్ర్య సంగ్రామం మనసును బహిర్ముఖం చేస్తున్న వేళ ఆసన్నమైంది. రెండు వందల సంవత్సరాల పరాయి పాలనను అంతం చేసే బృహత్తర కార్యక్రమం అప్పటికే ప్రారంభమైంది. అది యుద్ధమే! ఆయుధాలు, సైనిక బలం లేని ప్రజాబలం, మనోశక్తి, వ్యూహరచన, భిన్నశక్తులను సంఘటిత పరచడం, త్యాగం, సహనం, సమన్వయం వంటి సహజ భావనలను ప్రజాక్షేత్రంలో బలంగా పాదుకొల్పడమే ప్రధాన విధానాలుగా సాగేవి. ఇది ఆయుధం లేని యుద్ధం. ముందెన్నడూ ఎరుగని, వినని, కనని, రక్తపాతరహిత విప్లవం. విప్లవం అంటే విధ్వంసం కాదని, పరిణామగతిశీలమైన సకారాత్మక మార్పు అని భావించిన గాంధీజీ ఎంచుకున్న తోవ అహింసా మార్గం. ఇదొక వినూత్న ప్రయోగం. అహింసను ఆచరించడానికి ముందుగా కావలసింది సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ! ఇవన్నీ ప్రాపంచిక మనసుతో లభించవు. మరి దారి ఏది?

ఈ మథనంలో గాంధీజీ ఆశ్రయించినది భగవద్గీత. అది కర్మ, భక్తి, జ్ఞాన యోగాలు సంగమించిన అధ్యాత్మ త్రివేణి! తీవ్ర అధ్యయనం అనంతరం భగవద్గీతను అనుష్ఠాన వేదాంతంగా, పదునైన భావనా ఖడ్గంగా, భారతీయ ఆత్మను ఆవిష్కరించే దివ్య విధానంగా, రూపాంతరీకరణం చేసి.. భారతజాతి జనులను జాగృతం చేస్తూ, కర్తవ్యదీక్షా దక్షులుగా మార్చడమే బాపూ నమ్మిన కర్మయోగం. నిరంతర రామనామస్మరణతో, దైవశక్తి ఉనికిని ప్రసారం చేస్తూ భక్తి యోగాన్ని, మానవ ప్రజ్ఞను శాసించే దైవ ప్రజ్ఞ శక్తిమంతమైనదని జ్ఞానయోగాన్ని సమన్వయం చేస్తూ గాంధీజీ అధ్యాత్మ మార్గంలోకి ప్రవేశించడం, పయనించడం ఈశ్వర కృప!

మనో నియంత్రణ, నిర్భీతి, స్పష్టత, లక్ష్య గమ్యాలను సాధించడానికి కావలసిన దూరదృష్టి, విశాల దృష్టి, నిర్దుష్ట కార్యాచరణ వంటి ఎన్నిటినో భగవద్గీత నుంచి గ్రహించిన గాంధీజీ ఎంచుకున్నదీ, ఆచరించినదీ అధ్యాత్మ మార్గమే! జాతి, మత, కుల, వర్గ, వర్ణ లాంటి సంకుచిత పరిధుల నుంచి తనను తాను బయటపడవేసుకొని, నిష్ఠుర, కఠిన సత్యాన్ని గుండె నిండా నింపుకొని, దేశధర్మాన్ని, మానసిక శాంతిని, సర్వజనుల పట్ల ప్రేమను ఆచరణాత్మక వేదాంత ఖడ్గాన్ని ఝుళిపించింది. స్వాతంత్ర్య సమరాన్ని సత్యమార్గంలో, సవ్యరీతిలో నడిపించి, దేశాన్ని దాస్య విముక్తం చేయడంలో విజయం సాధించారు బాపూ. గాంధీజీ అధ్యాత్మనే ఆయుధంగా చేసుకొని దేశాన్ని విజేతగా నిలిపిన వైనం భారతదేశపు ఆత్మశక్తి! గాంధీమార్గం కాలాతీతం! గాంధీజీ కాలాతీత వ్యక్తి! గాంధీ స్మృతి అనుసరణీయం. ఆయన అధ్యాత్మవాదం సదా స్మరణీయం!!

... వీఎస్సార్ మూర్తి,
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

### ▪ 'గీత'.. కరదీపిక


**భగవద్గీత** ఓ వజ్రాల గని. పద్దెనిమిది అధ్యాయాలు చదివి, వాటి సారాన్ని ఆకళింపు చేసుకోవడం ద్వారా జీవితం ఆనందమయం అవుతుంది. భగవద్గీతలో కృష్ణుడు నాకు పౌరాణిక పాత్రలా కాకుండా.. ఓ మహాగురువుగా, దివ్య జ్ఞాన యోగీశ్వరుడుగా దర్శనమిస్తాడు. తరతరాల భరతజాతికి భగవద్గీత తరగని పెన్నిధి. ఈ మహాగ్రంథం విశ్వమానవ కల్యాణ కారకానికి ఉపయుక్తమయ్యే జీవన సూత్రాల సమాహారం. 'దీక్ష, కర్తవ్యం, విశ్వాసం, సత్యం, కృషి, గమ్యం వంటి ఉదాత్త అంశాల ప్రాతిపదికగా చిత్తశుద్ధితో లక్ష్యసిద్ధి సాధించాలి' అనే సిద్ధాంతాన్ని భగవద్గీత సంపూర్ణంగా బలపరుస్తుంది. భారత స్వాతంత్ర్య సంగ్రామ దీక్షకు కావలసిన శక్తియుక్తుల్ని, దృఢచిత్తాన్ని, సానుకూల దృక్పథాన్ని నేను భగవద్గీత నుంచి పొందాను. 'గీత' లేని నా జీవితాన్ని ఊహించలేను. అదృష్టం మీద నాకు నమ్మకం లేదు. భగవద్గీత అందించిన స్ఫూర్తి మీద నాకు అచంచలమైన విశ్వాసం ఉంది. యువతరానికి భగవద్గీత కరదీపిక కావాలి.

• మహాత్మా గాంధీ

# అనేకత్వంలో ఏకత్వం

**ఆధ్యాత్మిక సాధనలు ఎన్ని చేసినా అంతఃకరణ శుద్ధి అవసరం. భగవంతుడిని ఆరాధిస్తూ.. ఆయన చేసిన సృష్టిలో కొన్నిటిని గొప్పగా, కొన్నిటిని తక్కువగా చూడటం అల్పత్వం అనిపించుకుంటుంది. సమస్త చరాచర వస్తువుల్లోనూ తనను తాను దర్శించగల వాడే నిజమైన సాధకుడు అనిపించుకుంటాడు. అనేకత్వంలో ఏకత్వాన్ని దర్శించగలిగిన సాధకుడి ఆరాధననే దైవం స్వీకరిస్తాడు. అలాంటివారి పట్ల ప్రసన్నుడు అవుతాడు.**

**ఒకానొక** గ్రామంలో ఓ ఆలయం ఉండేది. దానికి అనుబంధంగా అద్దాల మంటపం నిర్మించారు. ఆ మంటపంలో చుట్టూ గోడలకు అద్దాలు అమర్చారు. అందులోకి ప్రవేశిస్తే.. ఎటు చూసినా ప్రతిబింబాలు కనిపిస్తాయి. ఓ రోజు ఆ గదిలోకి ఓ కుక్క ప్రవేశించింది. గదిలో ఏ మూలన చూసినా తనకు ఎదురుగా మరో శునకం ఉన్నట్టుగా అది భావించింది. అద్దంలో ఉన్నది తన ప్రతిబింబం అని గుర్తించక, ఎదురుగా ఉన్న కుక్కను చూసి కంగారుపడి దానిపై దాడికి యత్నించింది. అద్దంలో ప్రతిబింబం కూడా తనపై ఎదురుదాడికి దిగినట్టు కనిపించింది. చుట్టూ ఉన్న అద్దాలను రక్కడం మొదలుపెట్టింది. తలతో బాదుతూ మొరగసాగింది. ఈ ప్రయత్నంలో శునకానికి తీవ్ర గాయాలయ్యాయి. కాసేపటికి అక్కడే చతికిలపడి కన్నుమూసింది. సాయంత్రం ఆలయ నిర్వాహకుడు అద్దాల మంటపంలోకి వచ్చాడు. అక్కడే చచ్చిపడి ఉన్న కుక్కను చూసి 'అయ్యో' అనుకున్నాడు. పనివాళ్లను పురమాయించి కుక్క కళేబరాన్ని బయట పారవేయించాడు. మంటపం నుంచి వెళ్తూ వెళ్తూ.. అద్దంలో తనను తాను చూసుకొని, నుదుటిపై పక్కగా ఉన్న తిలకాన్ని సరిదిద్దుకుని బయటకు వెళ్లిపోయాడు.



కుక్కకు జ్ఞానం లేకపోవడంతో అద్దంలో ప్రతిఫలించిన కుక్కలన్నీ తానేనని భావించలేకపోయింది. ఆ శునకాలు వేర్వేరని భావించి, వాటిపై దాడికి దిగి ప్రాణాలు కోల్పోయింది. ఆలయ నిర్వాహకుడికి మాత్రం అక్కడి అద్దాల్లోని ప్రతిబింబాలన్నీ తనవేనని తెలుసు. అందుకే తను వచ్చిన పని చూసుకొని వెళ్లిపోయాడు. ఇద్దరికీ ఉన్న వ్యత్యాసం ఇదే! ఈ ప్రపంచంలో ఉన్నదంతా ఒకటే. అన్నిటిలోనూ ఉన్నది ఒకే ఆత్మ. భిన్నభిన్న ఉపాధులలో కనిపిస్తుంటుంది. అజ్ఞాని ఆ ఉపాధులను గుర్తించక తనకు భిన్నమైనదని భావిస్తుంటాడు. తన చుట్టూ మనుషుల్లో, వస్తువుల్లో భేదభావం ప్రదర్శిస్తూ అశాంతి కొని తెచ్చుకుంటాడు. భగవంతుని ఆరాధనలోనూ మనసు నిలుపలేకపోతాడు. కానీ, సమస్త జీవరాశుల్లో తానే (ఆత్మ ఒకటే) ఉన్నాననీ, అవన్నీ అద్దంలో ప్రతిబింబాల వంటివని గుర్తించగలిగిన వాడు ఉత్తముడు. అతనికి సృష్టిలో, మనుషుల్లో తారతమ్యాలు కనిపించవు. జీవకోటిపై కరుణ, దయ ఏర్పడుతుంది. అందరినీ సమానంగా చూసే గుణం అలవడుతుంది. ఆ స్థితికి చేరుకున్న వ్యక్తి జ్ఞాని అవుతాడు. అతని జీవితం ఆనందమయం అవుతుంది.

... శ్యామ్‌ప్రసాద్

## మనలోని స్వామికి..

**ఆత్మ ప్రదక్షిణ ఎలా చేయాలి? దాని పరమార్థం ఏమిటి?**
• **గాయత్రి,** హైదరాబాద్

**ఆత్మలో** ఉన్న పరమాత్మకు మనం చేసే ప్రదక్షిణకే ఆత్మ ప్రదక్షిణ అని పేరు. ప్రదక్షిణ ఎప్పుడూ కుడి నుంచి ఎడమ వైపునకు తిరుగుతూ చేయాలి. ఆలయంలో ప్రదక్షిణ చేసినప్పుడు ధ్వజస్తంభంతో కలిపి ఆలయాన్ని చుట్టిరావాలి. మన ఎదురుగా ప్రతిమగానీ, అర్చామూర్తిగానీ లేనప్పుడు ఆత్మ ప్రదక్షిణ చేయాలి. అవకాశం ఉన్నప్పుడు స్వామికే చేయడం మంచిది. సూర్యారాధన చేసినప్పుడు ఆత్మ ప్రదక్షిణ అవసరమవుతుంది. అటువంటి చోట్ల స్వామికే నేరుగా ప్రదక్షిణ చేసే అవకాశం ఉండదు. పూజా సమయంలో చివరగా 'మంత్రహీనం క్రియాహీనం..' అనే శ్లోకాన్ని చెప్పి, ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి అంటూ నమస్కారం చేయడం ఆచారం. అత్మ ప్రదక్షిణ అంటే మనకు మనం ప్రదక్షిణం చేసుకోవడం కాదు. మనలోని స్వామికి నమస్కరించడం అని గుర్తించాలి.




# దేవుడి మెప్పు కోసం

**ప్రఖ్యాత** ఇస్లామియా తత్వవేత్త జునైద్ బగ్దాదీ చదువుకుంటున్న రోజులవి. ఒకసారి గురువు జునైద్‌తో 'జుట్టు బాగా పెరిగిపోయింది. క్షౌరం చేయించుకో' అని చెప్పాడు. అయితే క్షురకుడికి ఇవ్వడానికి జునైద్ దగ్గర చిల్లిగవ్వ లేదు. గురువు చెప్పడంతో తప్పక క్షురకుడి దగ్గరికి వెళ్లాడు. అతనితో 'అల్లాహ్ కోసం క్షౌరం చేయమ'ని అడిగాడు. దానికి క్షురకుడు అంగీకరించాడు. క్షౌరం చేసిన తర్వాత తన జేబులోంచి నాణేల పొట్లాన్ని తీసి జునైద్‌కిస్తూ 'అవసరానికి వాడుకోండి' అన్నాడు. ఈ సంఘటన జరిగిన కొన్నేండ్లకు జునైద్ బగ్దాదీ ధార్మిక విద్యాభ్యాసం పూర్తయింది. గొప్ప పండితుడిగా పేరుగాంచాడు. ఒకసారి ఆయన దగ్గరికి ఓ బృందం వచ్చింది. వారిలో కొందరు జునైద్ ధార్మిక సేవను మెచ్చుకొంటూ వారికి బంగారు నాణేలను సమర్పించుకున్నారు. ఆ నాణేలను చూడగానే జునైద్‌కు క్షురకుడు గుర్తుకొచ్చాడు. వెంటనే అతని దగ్గరికెళ్లి ఆ నాణేల సంచిని అతని చేతిలో పెడుతూ.. 'నా దగ్గరకు మొదటిసారి ఏదైనా కానుక వస్తే అది మీకే ఇస్తానని ఆనాడు సంకల్పించుకున్నాను. ఇదిగో ఈ రోజు మీరు దీన్ని స్వీకరించండి' అన్నాడు. అది విన్న క్షురకుడు కోపంతో 'మీకు దేవుడి పట్ల భయం లేదా? ఎవరైనా దేవుని మెప్పు కోసం చేసిన పనికి ప్రతిఫలం ఆశిస్తారా? ఈ సంచిని మీరే ఉంచుకోండి' అని నిలదీస్తున్నట్లు చెప్పాడు. జునైద్ బగ్దాదీ నిర్ఘాంతపోయాడు. దైవంపై క్షురకుడికి ఉన్న విశ్వాసానికి ముగ్ధుడయ్యాడు. దేవుడి మెప్పు కోసం చేసిన పనికి ప్రతిఫలం ఆశించకూడదన్నది ఈ కథలోని నీతి.




... ముహమ్మద్ ముజాహిద్